‘ఫెంగల్’తో ఆగిన నూర్పిళ్లు

- పలుచోట్ల నేలకొరిగిన వరి
- నూర్పిడులు చేసిన ధాన్యం రోడ్లపైనే రాశులు
- పంట చేతికొచ్చేవేళ అన్నదాతలకు కష్టాలు

కొల్లిపర: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు, వర్షాలతో నియోజకవర్గంలో జోరుగా సాగుతున్న వరి నూర్పిడులకు ఆటంకం ఏర్పడింది. నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లవెంట రాశులు పోసి, వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు కోతకొచ్చిన వరిపైరు అక్కడక్కడా నేలకొరిగింది. కొన్నిచోట్ల కోతలు కోసిన చేలల్లో వరి పనలు కిందకు వర్షపునీరు చేరింది. అసలే ఖరీఫ్ సీజను ఆరంభంలో భారీ వర్షాలకు దిగుబడి తగ్గి, ఆందోళన పడుతున్న రైతులకు ఫెంగల్ తుఫాన్ ప్రభావం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నియోజకవర్గంలో ముందుగా వెదజల్లిన వరి చేలల్లో పంట కోతకు వచ్చిన విషయం తెలిసిందే. మండల గ్రామం తూములూరులో తొలిగా హార్వెస్టర్లతో నూర్పిడులను ఆరంభించారు. రెండు వారాల క్రితం ప్రారంభమైన నూర్పిడులు అన్నిచోట్లా విస్తరించాయి. కొన్నిచోట్ల కూలీలతో వరికోతలు కూడా జరుగుతున్నాయి. ఈ సమయంలో వాతావరణ శాఖ హెచ్చరికలు, ఈదురుగాలులతో వరి నూర్పిడులు, ముమ్మరమైన వరి కోతలనూ నిలిపివేశారు. మూడురోజులుగా అప్పుడప్పుడు వర్షం కూడా కురుస్తోంది. వర్షాలకు కోతకు వచ్చిన చేలు అక్కడక్కడా నేలకొరిగాయి.



తడిచిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు



కొల్లిపర మండలంలో నేలకొరిగిన వరి పైరు



వర్షానికి తడిసిన వరి పనలు

కోతలు పూర్తయిన చేలల్లో వరిపనలు తడిసి ముద్దవుతున్నాయి. ఈ పరిణామం రైతులను ఖిన్నులను చేస్తోంది. తెనాలి నియోజకవర్గంలో సుమారు 32 వేల ఎకరాలలో వరి సాగు చేయగా సుమారు 30 శాతమే కోతలు/నూర్పిడులు పూర్తయ్యాయి. నూర్పిడి చేసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో ఆరబెట్టేందుకు రహదారులపై అరబెడుతున్నారు.

వాతావరణం ముసురుపట్టి ఉండటం, వర్షపు జల్లులతో ఆరబెట్టటం సంగతటుంచి, తడవకుండా ధానాన్ని కాపాడుకోవటానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. భారీ వర్షం కురిస్తే ధాన్యం రాశులు తడిచే ప్రమాదముంది. ధాన్యం తడిచిపోకుండా ధాన్యం రాశులపై భారీ టార్పాలిన్లు వేసి భద్రత కల్పిస్తున్నారు మరో రెండు రోజుల పాటు వర్షా లు పడతాయని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళనపడుతున్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నాం



తుఫాన్ కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోవడంతో ఆరబెట్టుకుంటున్నాం. ధాన్యం ఆరకపోతే ఆయ వచ్చి పాడైపోతాయి. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు పడడంతో ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఇలాంటి సమయంలో తేమ శాతం చూడకుండా తక్షణమే కొనుగోలు కేంద్రాలు ద్వారా కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలి.

– పెరికల సుధాకర్, చివలూరు, కౌలు రైతు

రైతులు జాగ్రత్తలు పాటించాలి

తుఫాన్ కారణంగా మరో రెండురోజులు స్వల్పంగా లేదా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని తెనాలి ఏడీఏ ఉషారాణి సూచించారు. ఇప్పటికే వరి కోసి పనపై ఉన్నట్లయితే వాటని వెనక్కి తిప్పుకుని ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పనలపై ఉన్న వరి, కోతలు నిర్వహించని రైతులు వరి చేలలో పిల్ల కాలువలను ఏర్పాటు చేసి ఎప్పటి నీరు అప్పుడు బయటకు పోయేలా చర్యలు చేపట్టాలన్నారు.

– ఉషారాణి, వ్యవసాయ ఏడీఏ

చేతికందే సమయంలో ఇబ్బంది

మూడు ఎకరాలు మాగాణి భూమి కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. ఇప్పటివరకు రెండు ఎకరాల్లో పంట మిషన్ ద్వారా మాసూలు చేశాను. అయితే ఫెయింజల్ తుఫాన్ కారణంగా వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మిగిలిన ఎకరం కోత నిర్వహించలేదు . గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి గింజలు తడిచిపోయి నిమ్ములాగేస్తున్నాయి.

– ఎ.శంకరరెడ్డి, రైతు, మున్నంగి

క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కరించండి

24వ వార్డులో పర్యటించిన చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో పారుదల లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. 24వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురు గు కాల్వలు అధ్వాన్నంగా ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజు కాల్వలను ఎందుకు బాగు చేయటం లేదని ప్రశ్నించారు. మురుగు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, కో ఆప్షన్ సభ్యురాలు గొరికపూడి నిర్మలదేవి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు అంకమ్మరావు మృతి

సంతాపం తెలిపిన సీపీఎం నాయకులు



తెనాలిఅర్బన్: ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకులలో ఒకరైన తెనాలి నాజరుపేట వాసి పి.అంకమ్మరావు (95) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు అక్కడికి వెళ్లి పార్థవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అంకమ్మరావు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్.భవన్నారాయణ, కొల్లిపర బాబు ప్రసాద్, ములకా శివ సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, పి.జోసేష్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు కె.శివశంకర్, ఎస్.సుబ్రమణ్యం, డాక్టర్ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుపోయే విధంగా చూడండి



తెనాలిఅర్బన్: 39వ వార్డు ఆది ఆంధ్ర మున్సిపల్ స్కూల్ వెనుక రోడ్డులో మురుగు కాల్వల్లో పారుదల లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను పరిష్కరించాలని ఆప్రాంత వాసి ప్రేమ కుమారి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రం ఇచ్చారు. పరిష్కస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ

రేపల్లెరూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నా రు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను రహదారులపై పడవేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. పారిశుద్ధాన్ని మరింత మెరుగు పరిచేందుకు ప్రతి వార్డులో సిబ్బందిని నియమించి నిత్యం వారి పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు ఉన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కారానికై నిర్వ హిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.ప్రసాద్ చెప్పారు. పట్టణంలోని రెవె న్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంలో నిర్మిస్తున్న రైస్ మిల్లు తో కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందని, నిర్మాణం నిలుపుదల చేయాలని దామెర్ల రాజా రావు, అల్లపర్తి రమణారావులు వేర్వేరుగా రెండు దరఖాస్తులు చేశారన్నారు. రేపల్లె ఆర్టీసీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.వసంతబాబు డిపోలోని అధికారులు తనను వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశాడన్నారు. బేతపూడి గ్రామానికి చెందిన పరుచూరి సాయిప్రసాద్ తనపై చర్చి పాస్టర్ దాసుబాబు దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడన్నారు. నడక మార్గానికి విద్యుత్ స్తంభం అడ్డుగా ఉందని మార్చా లని రేపల్లె పట్టణం 13వ వార్డు నుంచి అర్జీ అందగా, రేపల్లె మున్సిపాలిటీలో అకాల వర్షాలతో విద్యుత్ స్తంభాలు, తీగలు మరమ్మతుకు గురయ్యాయని సరి చేయాలని అర్జీ అందిందన్నా రు. విద్యుత్ మీటర్ ఫీజ్ రీస్టోర్ చేయాలని 1, ఆక్రమణల సమస్యపై 1, డ్రైనేజీ సమస్యపై 1, పొలం ఆన్‌లైన్ చేయాలని 1 అర్జీలు అందాయన్నారు.

విద్యార్థులకు నాసా కిట్‌లు పంపిణీ

తెనాలిఅర్బన్: చిన్న వయస్సు నుంచే నూతన ఆవిష్కరణపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నాసా స్పేస్ సొసైటీ, నాసా రీసెర్చ్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ ప్రాజెక్టు డిజైన్ చేసేందుకు అర్హత సాధించిన గంగానమ్మ పేటలోని శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులకు సోమవారం కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులకు సోమవారం కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

తెనాలిరూరల్: మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెనాలి టూటౌన్ సీఐ రాములు నాయక్ ఆధ్వర్యంలో ఇక్కడి శ్రీచైతన్య స్కూలులో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగం, వాటి ప్రభావాలు, కేసులు వంటి వాటి గురించి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

గాంధీనగర్‌లో గ్యార్మీ పండుగ

తెనాలిరూరల్: పట్టణ నందులపేట గాంధీనగర్‌లో షేక్ షేక్ నసీమ్, తాజ్‌బాషా, మునీర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గ్యార్మీ జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనతో నాలుగో వార్డు కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు భరిదాసు గౌరీ శంకర్, టీడీపీ మైనార్టీ విభాగ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఖుద్దూస్, ఇతర నాయకులు ఉన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం

తెనాలిఅర్బన్: చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా దాని అభివృద్ధికి సహకరించటంతో పాటు విద్యార్థులను విద్యలో ప్రోత్సహించటం ఎంతో అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు పీవీ సుధారాణి పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో 1979–80వ సంవత్సరంలో పదోవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 9,10 తరగతుల్లో ఫార్మేటివ్ 1,2 పరీక్షలలో మంచి మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు సోమవారం సిల్వర్ మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2012 నుంచి పూర్వ విద్యార్థులు పాఠశాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వీరిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివప్రసాద్, షేక్ నూర్జహాన్, ఎస్ఎస్ ప్రకాష్, అహ్మద్, షరీఫ్, కె శ్రీనివాసరావు, జి.పోలేరమ్మ, కె భూలక్ష్మి, జే రాజేశ్వరరావు, హనుమంతరావు, చలమయ్య, రమణబాబు, ఇబ్రా, వెంకటరెడ్డి, షేక్ కరిముల్లా, వి.వాసు, సీఆర్‌పీ శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం సుధారాణి, పూర్వ విద్యార్థులు

పరిశుభ్రమైన నీటితోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: తాగునీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 148 మందికి బీపీ, షుగరు, యూరిన్, రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం పరిసరాల శుభ్రత, తాగునీరు, పౌష్టికాహారం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యురాలు శాంతి వివరించారు. శీతాకాలం కావడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుందని నాలుగురోజులకు ఓమారు తాగునీరు ఉండే కుండలను శుభ్రంగా కడుగుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు సక్రమంగా పారేలా ఉండాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు లోనయ్యే ప్రమాదం ఉందన్నారు. దాని నివారణకు ఆకుకూరలు, క్యారెట్, పాలు, పప్పుధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శాంతి

ఎన్నికల్లో ఫొటోలు, వీడియోలు తీశాం...

- బకాయిలు ఇప్పించండి
- తహసీల్దార్‌కు విన్నవించిన వీడియోగ్రాఫర్లు

తెనాలిరూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి రెవెన్యూ, పోలీసుల శాఖల తరఫున ఎన్నికల సంఘం కింద ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పని చేశామని, ఇప్పటికి ఏడు నెలలైనా వేతనాలు చెల్లించలేదని పలువురు వీడియోగ్రాఫర్లు సోమవారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిసి తమ గోడును వినిపించారు. ఎన్నికల సందర్భంగా 39 మంది వీడియోగ్రాఫర్లు కెమెరాలను పెట్టి వీడియోలు తీశామని, వాటికి సంబంధించి రూ. 24 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్‌కు తెలిపారు. ఇప్పటికే బిల్లులను ఆమోదం కోసం పంపామని, మరో రెండు వారాల్లో నిధులు విడుదలవుతాయని తహసీల్దార్ వారికి తెలిపారు. ఇక దీంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు వచ్చాయి. రీసర్వేలో భూమి వైశాల్యం తగ్గిందని, సర్వే చేయాలని, కోపల్లె డొంక రోడ్డులోని జేఎంజే స్వధార్ హోంలోని అనాథలకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందేలా చూడాలని, కోపల్లె గుడివాడలో రైతు పొలాన్ని రోడ్డుకు తీసుకుంటున్నారని అర్జీలు వచ్చాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

చిన్నారులకు ఆటల పోటీలు

రేపల్లె రూరల్: ఈ నెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని భవిత స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు పోటాపోటీగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్‌లు ఎస్.అనురాధ, వి.సుకన్య, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేషరతుగా ధాన్యం కొనుగోలు చేయాలి

తాడేపల్లిరూరల్: రైతులు పండించిన పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా తేమశాతం నిబంధనతో సంబంధం లేకుండా బేషరతుగా కొనుగోలు చేయించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల డిప్యూటీ తహసీల్దార్ దుర్గకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు వరిపంట దిగుబడి తగ్గిందని, దానికి తోడు మద్దతు ధర గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం తగ్గిందన్నారు. గతంలో ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తే ఈ ఏడాది ఎకరాకు 25 నుంచి 30 బస్తాలు మాత్రమే వచ్చాయని తెలిపారు. పంట మద్దతు ధర క్వింటాలుకు రూ.2340 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆ విధంగా 75 కేజీల బస్తా రూ.1740 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.1350–1400వరకు కొంటున్నారని, ఈ విధంగా రైతులు ఎకరానికి రూ.20–24 వేల వరకు నష్టపోతున్నారని అన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా దుగ్గిరాల మండలంలోని అన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.1740కు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమచేయాలని, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందించాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎన్.యోగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కంపోస్టు యార్డే పెద్ద సమస్య!!

- తరచూ మంటలు, పొగతో తీవ్ర అసౌకర్యం
- కంపోస్టుయార్డు ఖాళీకి ఖరారైన టెండరు
- మార్చిలోగా తరలిస్తామని అధికారుల వెల్లడి

తెనాలి: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ కంపోస్టుయార్డులో పొగభూతం ప్రజలను భయపెడుతూనే ఉంది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గత రెండుమూడు రోజులుగా అప్పుడప్పుడూ వర్షం కురుస్తున్నా, కంపోస్టు యార్డులో మంటలు ఆరకపోవటం గమనించాల్సిన అంశం . గత నెల 27న తీవ్రమైన పొగతో జనం ఉక్కిరిబిక్కిరైన ఘటనను ‘సాక్షి’లో ప్రచురితమయ్యాక మున్సిపల్ అధికారులు స్పందించారు. అదేరోజు మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో నీటిని తెప్పించి, చల్లార్చే ప్రయత్నం చేశారు. అదే సమయంలోనే ఇద్దరు అధికారుల మధ్య వివాదం ఏర్పడింది. ఆ వివాదం చల్లారినా ఇక్కడ కంపోస్టుయార్డు కాష్టం మాత్రం చల్లారటం లేదు. సోమవారం కూడా యార్డులో మంటలు కొనసాగుతూ పొగలు చుట్టేస్తూ కనిపించాయి. చెత్త ఎక్కువకాలం నిల్వ ఉంటున్నందున మిథేల్ గ్యాస్ ఉత్పత్తి అవుతూ మంటలకు దారితీస్తుందని తెలుస్తోంది. తెనాలి పట్టణ జనాభా విస్తరిస్తూ ఉంది. జనాభా దాదాపుగా రెండు లక్షలకు చేరుకుంది. రోజురోజుకీ చెత్త పెరుగుతోంది. ప్రస్తుతం పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 80 టన్నుల చెత్త వస్తోందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇందులో తడిచెత్త, పొడిచెత్త ఉంటాయి. ప్లాస్టిక్ సంచులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా ఉంటున్నాయి. రోజువారీ చెత్తను తగ్గించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇదే కంపోస్టు యార్డులో తడిచెత్త నుంచి వర్మీకంపోస్టు, బయోగ్యాస్ తయారీ యూనిట్లను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఇందులో ఏడు టన్నుల తడిచెత్తను వీటి కోసం వినియోగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఒక పెద్ద కంపాక్టర్, మరో మూడు చిన్న కంపాక్టర్లలో చెత్తను పేరేచెర్ల దగ్గర్లోని జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. ఆ మొత్తం 20 టన్నులు ఉంటుందని అంచనా. ఇక పోతే మిగిలిన 57 టన్నుల చెత్త రోజూ కంపోస్టు యార్డుకు చేరుకుంటోంది. కొండలను తలపిస్తూ చెత్త పేరుకుపోతోంది. కంపోస్టు యార్డుతో సమీపంలోని పంటపొలాలకు సమస్య ఏర్పడుతుందని సమీప రైతులు పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నారు. ప్రహరీ ముక్కలుగా విడిపోయి పడిపోతుండటం మరో సమస్య. దీనికితోడు అప్పుడప్పుడూ చెత్తనుంచి మిథైల్ గ్యాస్ విడుదలవుతూ, చెత్త దానికదే తగులబడుతోంది. రోజుల తరబడి కొనసాగటంతో దానినుంచి వచ్చే హానికరమైన పొగలు సమీపంలోని అరకిలోమీటరు వరకూ వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రజలకు కళ్లు మండటం, ఊపిరి పీల్చుకోవటానికి ఇబ్బంది పడుతుంటారు. ఆ దారిలోనే పలు విద్యా సంస్థలున్నాయి. దాల్ మిల్లులున్నాయి. అతి దగ్గర్లోనే అపార్టుమెంట్లు, బీసీ కాలనీ ఉన్నాయి. కంపోస్టు యార్డు కారణంగా వీరందరూ బాధితులే. రోజూ వాకింగ్ చేసే అలవాటున్న వాకర్స్ కూడా ఈ వాయుకాలుష్యం కారణంగా అటుకేసి వెళ్లటం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలోనే కేంద్ర సహాయమంత్రి, సమీప బుర్రిపాలెంకు చెందిన ప్రవాస భారతీయుడు పెమ్మసాని చంద్రశేఖర్ కంపోస్టు యార్డును అక్కడి నుంచి తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం రూ.3.17 కోట్లకు టెండరు ఖరారైనట్లు సమాచారం. అమృత్ నిధులు, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. యార్డులోని ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప ముక్కలు వంటి వాటిని గ్రేడింగ్ చేసి, వాటిని, చెత్తను వేర్వేరుగా తరలిస్తారు. వచ్చే ఏడాది మార్చిలోగా కంపోస్టు యార్డులోని చెత్త మొత్తాన్ని తొలగించి మున్సిపాలిటీకి అప్పగిస్తారు. ఈలోగా మున్సిపల్ చెత్త కోసం మరో ప్రదేశాన్ని అన్వేషించే పనిలో ఉన్నారు.



మున్సిపల్ కంపోస్టు యార్డు

ఎవరైనా కోరితే చెత్త తరలిస్తాం



కంపోస్టు యార్డు నుంచి చెత్త తరలించే టెండరు ఖరారైంది. వర్షాలు తగ్గిన వెంటనే కార్యక్రమం ఆరంభమవుతుంది. పంటపొలాలు, ప్రైవేటు స్థలాలు ఏవైనా పల్లంగా ఉంటే మెరక చేసుకునేందుకు కోరిన వారికి చెత్త సరఫరా చేస్తాం. అవసరమైన వారు సంప్రదించవచ్చు.

– ఆకుల శ్రీనివాసరావు, మున్సిపల్ ఇన్‌చార్జి ఇంజినీరు